సాక్షి వనపర్తి

శనివారం । 16 । ఆగస్టు । 2025



అందుబాటులో లేని అర్చకులు

అలంపూర్ క్షేత్రంలో సస్పెన్షన్‌కు గురైన అర్చకులు అందుబాటులో లేకపోవడంతో వారి ఇంటి గోడలకు నోటీసులు అంటించారు.

-8లో ▸



నాలుగు గేట్లు ఎత్తివేత

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరగడంతో నాలుగు క్రస్టుగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం

33.9 /22.1

వాతావరణం

రోజంతా వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

180 పసుపు చీరలతో అమ్మవారికి అలంకరణ



వనపర్తి రూరల్: శ్రావణ మాసం నాల్గో శుక్రవారం సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులు కిట్టుస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, మహామంగళ హారతి నీరాజన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారు 180 పసుపు రంగు చీరల అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో లలితాసహస్ర పారాయణం, కుంకుమార్చన, పల్లకీసేవా తదితర పూజలు చేశారు.

‘ఓట్లు చోరీ చేసి నీతులు చెప్పడం హాస్యాస్పదం’



అమరచింత: ఓట్లు చోరీ చేస్తూ గద్దెనెక్కాలనుకున్న బీజేపీ ఇతర పార్టీలను విమర్శించడం ఎంత వరకు సమంజసమని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ ప్రశ్నించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓట్‌కి చోర్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలను అడ్డుపెట్టుకొని కేంద్రంలో మూడు పర్యాయాలు అధికారంలోకి వచ్చారని బీజేపీపై విమర్శలు గుప్పించారు. బీహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఓట్లను తొలగించడమే ఇందుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరిపై బీజేపీ నాయకులు ఆరోపణలు చేయడం తగదన్నారు. పూటకో రాజకీయ పార్టీలో చేరుతూ ప్రజా సమస్యలను గాలికొదిలిన బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీపై విషం చిమ్మడం మానుకోవాలని హితవు పలికారు. అమరచింత పట్టణంలో రూ.13 కోట్లతో ఎంపీ డీకే అరుణ తాగునీటి పథకాన్ని తీసుకొచ్చారని చెప్పిన నాయకులు వీటిలో 40 శాతం నిధులు రాష్ట్రానివి అన్న విషయం మరిచిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్లు పోసిరిగారి విష్ణు, శ్యాం, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తౌఫిక్, ప్రకాశం, హనుమంతునాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం

- చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి
- ఘనంగా 79 స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు
- హాజరైన కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

వనపర్తి: జిల్లాలో సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అధికా రులు, పాలకులు పనిచేస్తున్నారని శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి, వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. వేదికపై కలెక్టర్ ఆదర్శ్‌సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, వనపర్తి, దేవరకద్ర శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ కీమ్యానాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య హాజరయ్యారు.

కొత్తగా 17,490 రేషన్ కార్డుల జారీ..

జిల్లాలో కొత్తగా 17,490 రేషన్ కార్డులను జారీచేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న కార్డుల్లో కొత్తగా 29,858 మందిని చేర్చినట్లు వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉగాది నుంచి రూ.13 వేల కోట్లతో 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నామన్నారు.

60,545 రైతులకు రుణ విముక్తి

గతేడాది ఆగస్టు 15న రైతు రుణమాఫీకి ఈ ప్రభుత్వం శ్రీకారం చుట్టగా.. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణ మాఫీ కాగా.. జిల్లాలో 60,545 మంది రైతులకు రూ.480.91 కోట్ల 91 లక్షల రూపాయల రుణ మాఫీ చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం అందించినట్లు పేర్కొన్నారు

వైద్య రంగానికి పెద్దపీట

జిల్లాలో ఉన్న 330 పడకల ఆస్పత్రిని 530 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల సీహెచ్‌సీగా మార్చుతూ సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేశారన్నారు. డయాబెటిస్ వ్యాధిని నియంత్రించేందుకు ‘మిషన్ మధుమేహ కార్యక్రమంతో 30 ఏళ్లు పైబడిన సుమారు మూడు లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 19,643 మందికి డయాబెటిస్ వ్యాధి ఉన్నట్లుగా గుర్తించినట్లు వెల్లడించారు.

ధాన్యం కొనుగోళ్లలో టాప్

యాసంగిలో 388 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 4.99 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలోనే వనపర్తి జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌లో 10వ స్థానం

తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. రూ.22,500 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. జిల్లాలో 6,538 మంది లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీల సిఫారస్ మేరకు ఎంపిక చేశాం. ఇప్పటికే 52 శాతం ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామని, గ్రౌండింగ్‌లో జిల్లా రాష్ట్రంలో 10 స్థానంలో ఉందన్నారు.



జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న శాసనమండలి చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్‌సురభి, ఎస్పీ రావుల గిరిధర్, అధికారులు

పకడ్బందీగా శాంతిభద్రతల పరిరక్షణ

జిల్లాలో మెరుగైన శాంతిభద్రతల కల్పనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి అన్ని మండలాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి నిత్య పర్యవేక్షణ చేయడం ద్వారా నేరాలను నియంత్రిస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకంపై జిల్లాలో ప్రత్యేక పోలీస్ నిఘా టీమ్స్ ఏర్పాటు చేసి, ప్రత్యేక నార్కోటిక్ డాగ్స్ ద్వారా బ్లాక్ స్పాట్స్, బస్టాండ్, కళాశాలలు, ఇతర రద్దీ గల ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, యాదయ్య, అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు, వనపర్తి, పెబ్బేరు మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్‌గౌడ్, ప్రమోదిని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్యేలతో కలిసి తిలకించారు. ప్రభుత్వ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లాలోని మెప్మా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన రూ.10.08 కోట్ల చెక్కును అందజేశారు. గత విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు టెన్త్, ఇంటర్ విద్యార్థులను సత్కరించి, ఒక్కక్కరికి రూ.10వేల చెక్కు అందజేశారు.



సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్న చిన్నారులు

మహనీయుల త్యాగాలు మరువలేనివి

ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: స్వాతంత్య్ర పోరాటంలో అసువులుబాసిన మహనీయుల సేవలు మరువలేనివని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎస్పీ రావుల గిరిధర్ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్రిటీష్ వలస పాలన నుంచి స్వాతంత్య్రం లభించి నేటితో 78 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో దేశం ఎన్నో రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. మన స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను అందరూ గుర్తుచేసుకుంటూ.. వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందిచాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో శాంతి భద్రతల ప్రాముఖ్యతను గుర్తించుకుని పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యత, నిబద్ధతతో పనిచేయాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలని, ప్రతి బాధితుడికి న్యాయం చేయగలిగినప్పుడే మన స్వాతంత్య్రానికి నిజమైన సార్థకత లభిస్తుందన్నారు. అనంతరం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు అధికారులకు, సిబ్బందికి చదరంగం, క్యారమ్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ సునందన, వనపర్తి సీఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, సీసీఎస్ సీఐ రవిపాల్, రిజర్వ్ సీఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

స్పీడ్ బోట్ ప్రారంభం



స్పీడ్ బోటును ప్రారంభిస్తున్న టూరిజం శాఖ జిల్లా అధికారి నర్సింహ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ శివారు కృష్ణానదిలో పర్యాటకుల సౌకర్యార్థం జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ శుక్రవారం స్పీడ్ బోటు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు టూరిజం కార్పొరేషన్ నిధుల నుంచి 6 స్పీడ్ బోట్లు మంజూరు చేయించారు. ఈ క్రమంలో మంత్రి జూపల్లి ఆదేశాల మేరకు సోమశిల దగ్గర నదిలో స్పీడ్ బోటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానదిలో పర్యాటకుల కోసం సోమశిల నుంచి శ్రీశైలం వరకు ప్రయాణించడానికి క్రూయిజ్ లాంచీని మంగళవారం నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీశైలం వెళ్లాలనులకునే ప్రయాణికులు తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మద్దిలేటి, నాయకులు రంగస్వామి, రమేష్‌గౌడ్, మహేష్, టూరిజం శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతే లక్ష్యంగా గంజాయి సరఫరా

- ఒక్కో పాకెట్ రూ.500 విక్రయం
- పట్టుబడిన యువకుల విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి..
- నేడో.. రేపో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న పోలీసులు

గద్వాల క్రైం: ఐదురోజుల క్రితం జిల్లా కేంద్రంలో గంజాయి తీసుకుంటూ పట్టుబడిన యువకులను పోలీసులు పట్టుకొని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించి కౌన్సెలింగ్ అందించిన విషయం విధితమే. వారి నుంచి గంజాయి ఎవరు విక్రయిస్తున్నారని తెలుసుకొని.. గత బుధవారం ఇద్దరు అనుమానిత వ్యక్తులను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారిని విచారిస్తున్నారు. అయితే పట్టణానికి చెందిన ప్రధాన గంజాయి విక్రేత యువతను లక్ష్యంగా ఎంచుకుని రహస్యంగా విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది. ఓ చిన్నపాటి కవర్లలో ప్యాక్ చేసి ఒక్కో పాకెట్‌ను రూ.500 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. గంజాయి తీసుకుంటున్న వారిలో కళాశాల విద్యార్థులు, పనీపాట లేకుండా ఆవారా తీరుగుతున్న యువకులు, వివిధ ఫ్యాక్టరీల్లో పనిచేసే కూలీలే అధికంగా ఉన్నట్లు సమాచారం. గంజాయి విక్రేత గత కొన్ని రోజులుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి నిషేధిత గంజాయిను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసుల విచారణలో గద్వాల మండలానికి చెందిన 15 మంది యువకులకు గంజాయి విక్రయించినట్లు తెలియడంతో ఆ యువకులను సైతం పోలీసులు విచారించినట్లు తెలుస్తుంది. ప్రధాన సూత్రదారులెవరు..? ఏఏ రాష్ట్రాల నుంచి ఎవవరు వీరికి గంజాయి సరఫరా చేస్తున్నారు, ముఠా సభ్యులు ఇంకా ఎంత మంది ఉన్నారంటూ కూపీ లాగుతున్నారు. పట్టుబడిన ఒక యువకుడి నుంచి 500 గ్రాముల గంజాయి పాకెట్లను అధికారులు గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ‘సాక్షి’ సదరు అధికారులను వివరణ కోరగా.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నామని, ప్రస్తుతం విచారిస్తున్నామని, పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

కలకలం

నిషేధిత మత్తు పదార్థాలపై పోలీసు, ఎక్సైజ్, విజిలెన్స్, నిఘా వ్యవస్థలు నిత్యం చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేస్తున్నప్పటికి గుట్టుగా గంజాయి ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు తీసుకువచ్చి విక్రయించడం గమనార్హం. చెక్‌పోస్టులు, అధికారుల కళ్లుగప్పి జిల్లాకు తీసుకురావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో వారం రోజుల క్రితం ముగ్గురు యువకులను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన క్రమంలో పలు ఆసక్తికరమైన విషయాలు విచారణలో వెల్లడి అవుతుండడంతో జిల్లాలో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. గంజాయి తీసుకునే వారిలో యువతే ఎక్కువగా ఉండడంతో కలకలం సృష్టిస్తుంది.

ఉత్తమ సేవలకు పురస్కారం

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందించారు. ఈ సందర్భంగా చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఎస్టీ గురుకులం, వనపర్తి కేజీబీవీ విద్యార్థినులు సాంప్రదాయ దుస్తువుల్లో దేశభక్తి గేయాలకు నృత్యాలు చేశారు. కలెక్టరేట్ ఆవరణ జనసందడితో కళకలలాడింది. నృత్యాలు చేసిన విద్యార్థినులను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు అభినందించారు. - వనపర్తి



ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ యాదయ్య



డి. సుబ్రమణ్యం | భూపాల్‌రెడ్డి, సీపీఓ | అంజయ్య, డీఐఈఓ, వనపర్తి | మల్లయ్య, ఈఈ పీఆర్, వనపర్తి | టి.మేఘారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ | విఠోభ, హౌసింగ్, వనపర్తి | ఎ. శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్‌ఓ



రఘునాథ్‌రెడ్డి, డీపీఓ | డి. మదన్‌మోహన్, సూపరింటెండెంట్ | మల్లికార్జున్, తహసీల్దార్ | ఎం.ఎ.రహీమ్, సీసీ అదనపు కలెక్టర్ | బాలక్రిష్ణ, సీసీ అదనపు కలెక్టర్ | శ్రావణ్, సీసీ కలెక్టర్ | వెంకటేష్‌గౌడ్, గన్‌మెన్, కలెక్టర్ | ఎ.శ్రీకాంత్, ఆఫీస్ సబార్డినేట్ | రమేష్‌కుమార్, ఎలక్షన్ విభాగం | సయ్యద్, డ్రైవర్, కలెక్టర్ | యాదగిరి, ఆఫీస్ సబార్డినేట్,




ప్రవీణ్, డ్రైవర్, కలెక్టరేట్ | వెంకటేశ్వర్‌రావు, డీఎస్పీ | కృష్ణయ్య, సీఐ | నరేష్, సీఐ, ఎస్‌బీ | అప్పలనాయుడు, ఆర్ఐ, అడ్మిన్ | వి.నరేందర్, ఎస్ఐ | అంజాద్, ఎస్ఐ | ఎస్. సురేందర్‌బాబు, ఆర్ఎస్ఐ | శివపార్వతి, ఏఎస్ఐ | ఎస్. రాజగౌడ్, పీఆర్ఓ, ఎస్పీ | డా.సాయినాథ్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి

రైతుల కోసం యూట్యూబ్ ఛానల్

కొత్తకోట రూరల్: స్థానికంగా ఉద్యాన రైతులకు శాస్త్రీయ సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఉద్యాన వన కళాశాల, మోజర్ల ఆధ్వర్యంలో యూట్యూబ్ ఛానల్ ప్రారంభిస్తున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా కళాశాలలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ.. ఉద్యాన పంటలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ప్రతి ఉద్యాన రైతుకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి కళాశాల వాట్సాప్ గ్రూప్, యూట్యూబ్ ఛానల్ ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌ఏ డాక్టర్ శంకర్‌స్వామి, జె.శ్రీనివాస్, కె.భాస్కర్, డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ జి.విద్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఉపాధి కల్పనే లక్ష్యం

గద్వాలటౌన్: యువతకు చదువుతో పాటు పలు ఉపాధి కోర్సులు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఐటీఐలను ఇటీవల ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ సెంటర్లు (ఏటీసీ)గా ఉన్నతీకరించి పలు అధునాతన కోర్సులను ప్రవేశపెట్టిందని ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులో ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రాన్ని, అక్కడ కొనసాగుతున్న పనులను శుక్రవారం కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి జితేందర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం టాటా సంస్థల సహకారంతో ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. సమాజంలో ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న రోబోటిక్, విద్యుత్ వాహనాల మరమ్మతులు, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ టెక్నీషియన్ వంటి కోర్సులు అందుబాటులోకి తెచ్చిందన్నారు. పోటీ ప్రపంచంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హనుమంతు, సహాయ లేబర్ కమిషనర్ మహేష్‌కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.



యంత్రాలను పరిశీలిస్తున్న ఏపీ జితేందర్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో జాతీయ గీతానికి విద్యార్థుల నృత్యప్రదర్శన



వనపర్తిలో గిరిజన వేషధారణలో విద్యార్థినుల నృత్యం



అయిజలో ఆపరేషన్ సిందూర్‌ను ప్రతిబింబిస్తూ..



ఉప్పొంగిన దేశభక్తి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శుక్రవారం స్వాతంత్య్ర వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం సాయుధ బలగాల కవాతు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి, సందేశాత్మక గీతాలకు విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. మరికొందరు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. నృత్యప్రదర్శనలో చక్కటి ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. - సాక్షి నెట్‌వర్క్





గద్వాలలో జాతీయ పతాకం చేతబూని..



మహబూబ్‌నగర్‌లో సాయుధ బలగాల కవాతు



మహబూబ్‌నగర్‌లో స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ



నారాయణపేటలో చేపతో మంత్రి వాకిటి శ్రీహరి



నాగర్‌కర్నూల్‌లో తాడూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ప్రదర్శన

వరదలో కొట్టుకుపోయి రైతు మృతి



పెంట్యానాయక్ (ఫైల్)

లింగాల: మండల కేంద్రానికి సమీపంలోని పద్మన్నపల్లి వెళ్లే మార్గంలో ఉన్న చిన్నవాగులో లింగాలకు చెందిన ముడావత్ పెంట్యానాయక్(65) వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రైతు పెంట్యానాయక్ గురువారం వాగు దాటి వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో వాగు ఉధృతి అధికంగా ఉండడంతో గమనించని రైతు దాటే ప్రయత్నం చేయగా కొట్టుకుపోయాడు. పొలానికి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో వాగు వెంట వెళ్లగా వాగులో ఓ కంపచెట్టుతాకి ఉన్నట్లు గమనించిన కుటుంబ సభ్యులు మరణించినట్లు నిర్ధారించుకున్నారు. మృతుడికి భార్య ముడావత్ లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


నీటి సంపులో పడి కార్మికుడి మృతి

బిజినేపల్లి: గ్రామ పంచాయతీకి చెందిన నీటి సంపులో పడి పంచాయతీ కార్మికుడు మందడి కురుమయ్య (48) మృతి చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలెం గ్రామానికి చెందిన కురుమయ్య గురువారం రాత్రి గ్రామ పంచాయతీకి చెందిన నీటి సంపు వద్దకు వెళ్లాడు. ప్రమాదశావత్తు అందులో పడి మునిగిపోయాడు. కాసేపటికి సహచర కార్మికులు గమనించి చూస్తే కురుమయ్య అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. తక్షణమే మృతదేహాన్ని బయటకి తీసి నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. కురుమయ్యకు భార్య వెంకటమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై కేసు నమోదు

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన విద్యార్థి కొండ్రెడి శివప్రసాద్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి పేర్కొన్నారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. విద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులు చేసి వాటిని తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. శివ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నట్లు గుర్తించిన తల్లిదండ్రులు మొదట హెచ్చరించారు. అప్పులు ఇచ్చిన వారు ఇంటికి వస్తుండడంతో వారికి సర్దిచెప్పి అప్పులు తీర్చుతామని తల్లిదండ్రులు చెప్పారు. గురువారం మరోసారి శివప్రసాద్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడగా.. డబ్బులు పోయాయి. దీంతో మనస్థాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వివరించారు. మృతుడి తల్లి భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూరాలకు మళ్లీ పెరిగిన వరద



18 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు/ రాజోళి/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. గురువారం రాత్రి వరకు ప్రాజెక్టుకు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. శుక్రవారం రాత్రి వరకు 1.45 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 18 క్రస్టు గేట్లను ఎత్తి 1,26,954 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే విద్యుదుత్పత్తి నిమిత్తం 34,590 క్యూసెక్కులు వదలగా 47 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.869 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులకు 31 వేల క్యూసెక్కులు

సుంకేసుల డ్యాంకు 31 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 7 గేట్లను ఒక మీటర్ మేర ఎత్తి 27,937 క్యూసెక్కులను దిగువకు, కేసీ కెనాల్‌కు 1,394 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

వేగవంతంగా విద్యుదుత్పత్తి..

జూరాలకు ఎగువ నుంచి భారీ వరద నీరు వస్తుండటంతో జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు శుక్రవారం ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

శ్రీశైలంలో నాలుగు గేట్లు ఎత్తివేత

దోమలపెంట: శ్రీశైలం ఆనకట్ట వద్ద శుక్రవారం నాలుగు గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 1,13,920 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 34,590 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 12,621 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కులు మొత్తం 1,61,381 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీశైలంలో ఆనకట్ట నాలుగు గేట్లు ఒకొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 80,232 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు భూగర్భ కేంద్రంలో 16.892 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 15.281 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తూ 30,885 క్యూసెక్కులు మొత్తం 66,242 క్యూసెక్కుల నీరు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.1 అడుగుల నీటిమట్టం వద్ద 199.2737 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20,542, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,638 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

జిల్లాకో పార్లమెంటు సెగ్మెంట్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

గండేడ్: జిల్లాకో పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ రుద్రారెడ్డి, మాజీ ఎంపీపీ కొమిరె లక్ష్మయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఏపీ రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం నంచర్ల గేటు వద్ద గండేడ్, మహమ్మదాబాద్ ఉమ్మడి మండలాలకు చెందిన అన్ని పార్టీల నాయకులతో వికారాబాద్ సాధన జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి గండేడ్ మండలాన్ని మహబూబ్‌నగర్‌లో కలపడం ద్వారా అన్ని అవకాశాలు కోల్పోవడమే గాక తీవ్ర వివక్షకు గురవుతున్నామన్నారు. విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారన్నారు. అంతేగాక అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పరిగి, చేవెళ్ల ఉండగా.. జిల్లా మాత్రం మహబూబ్‌నగర్ ఉందని వారు పేర్కొన్నారు. ఓట్లు ఇక్కడ వేసి.. పనులు అక్కడ అనేసరికి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయ అవకాశాలు కూడా లేకపోవడంతో రెండు మండలాలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గత ఎన్నికల సమయంలో గండేడ్, మహమ్మదాబాద్ మండలాలను వికారాబాద్‌లో కలుపుతామని అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తమ గోడు పట్టించుకొని రెండు మండలాలను వికారాబాద్ జిల్లాలో కలపాలని కోరారు. ఇందుకు అన్ని పార్టీల నాయకులు కలిసి రావాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు మండలాల్లోని గ్రామాలన్నీ ఒకే జిల్లా పరిధిలో ఉంటే ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాయకులు గిరమోని శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, వెంకటయ్య, ఆశన్న, కుందేటి కిష్టయ్య, నర్సింహులు, బిక్షపతి, విజయ్‌కుమార్‌రెడ్డి, శంకర్‌నాయక్, మల్కయ్య, గఫార్, దస్తయ్య ఉన్నారు.

అందుబాటులో లేని అర్చకులు

సస్పెన్షన్ నోటీసులు ఇంటి గోడలకు అంటించిన వైనం



అలంపూర్: ఇటీవల సస్పెన్షన్‌కు గురైన అర్చకులు.. నోటీసులు అందుకునేందుకు అందుబాటులో లేకపోవడంతో వారి ఇంటి గోడలకు నోటీసులు అంటించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు అర్చకులు ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారనే అంశంపై దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే, ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఈఓను సైతం బదిలీ చేశారు. అయితే సస్పెండ్ అయిన అర్చకులు నోటీసులు తీసుకోవాలని తెలపగా.. వారు రాలేదని సమాచారం. శుక్రవారం కొత్త ఈఓ బాధ్యతలు స్వీకరించడానికి కంటే ముందే పాత ఈఓ.. ముగ్గురు అర్చకుల ఇళ్లకు సిబ్బందిని పంపించారు. అక్కడ అర్చకులు అందుబాటులో లేకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు వారి ఇంటి గోడలకు నోటీసులు అంటించి వచ్చినట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన జోగుళాంబ ఆలయ ఈఓ దీప్తి



అలంపూర్: జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల నూతన ఈఓగా దీప్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఈఓ ఇటీవల జమ్ములమ్మ, పరశురామస్వామి దేవస్థానానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గంగాపురం ఆలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్–1 అధికారి దీప్తిని నియమించారు.

చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం

ఎర్రవల్లి: ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబ కలహాల కారణంగా వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవినాయక్ కథనం మేరకు.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఏదుట్లకు చెందిన నిరాడి సాయిబాబ (39) మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి ఐదేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 12న తిరుపతికి వెళ్తానని కుటుంబ సభ్యులతో చెప్పి హైదరాబాద్ నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో ఎర్రవల్లి మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ సమీపంలో శుక్రవారం ఓ చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పాము

ఇద్దరు విద్యార్థులకు తప్పిన ప్రమాదం

పాన్‌గల్: వనపర్తి జిల్లాలోని పాన్‌గల్ మండలం గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం పాము కాటు నుంచి ఇద్దరు విద్యార్థులు తప్పించుకున్నారు. ఎంఈఓ శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం కథనం ప్రకారం.. పాఠశాల గదిలో ఉన్న టేబుల్‌ను పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థి రాజు, 5వ తరగతి విద్యార్థి కాన్షీరాం బయటికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో టేబుల్ కింద ఉన్న పాము ఆ విద్యార్థులపై పడి, కాన్షీరాంను కాటు వేసిందన్నారు. వెంటనే పాఠశాల ఉపాధ్యాయ బృందం అప్రమత్తమై పామును చంపేసి బాధిత విద్యార్థులను కారులో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు విద్యార్థులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని, పాము కూడా విషం లేని పాము అని వైద్యులు చెప్పడంతో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను ఎంఈఓ పరామర్శించి జరిగిన ఘటనపై ఆరా తీశారు. పాఠశాల భవనం గ్రామ శివారులో వ్యవసాయ పొలాల పక్కన ఉండటంతో పాములు పాఠశాల ఆవరణలోకి వచ్చి ఉంటాయని, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉంటూ భవనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన వారికి సూచించారు.



విద్యార్థి కాన్షీరాంను పరామర్శిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం

సరళాసాగర్‌కు వరద తగ్గుముఖం

మదనాపురం: సరళాసాగర్ ప్రాజెక్టుకు శుక్రవారం వరద తగ్గుముఖం పట్టింది. దీంతో 1 వుడ్ సైఫన్, రెండు ప్రైమరీ సైఫన్ల ద్వారా 4400 క్యూసెక్కుల నీరు దిగువకు పారాయి. గురువారం ఎగువ నుంచి వరద ఉధృతి పెరగడంతో ఆటోమేటిక్ సైఫన్లు తెరుచుకున్న విషయం తెలిసిందే. ఇక శంకర సముద్రం ద్వార ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో రామన్‌పాడు ప్రాజెక్టు వద్ద ఒక గేటు ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దంతనూరు – శంకరమ్మపేట గ్రామాల మధ్య ఊకచెట్టు వాగు పొంగి పొర్లడంతో 5 మండలాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.



సరళాసాగర్ సైఫన్ ద్వారా దిగువకు పారుతున్న నీరు

ఫర్టిలైజర్ గోదాంలో షార్ట్ సర్క్యూట్

రూ. 4 లక్షల ఆస్తి నష్టం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన గోదాం

అయిజ: మండలంలోని పులికల్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి బార్కి రామలింగన్న గోదాంలో షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. బాధితుడు వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా గోదాంలో నిల్వ చేసుకున్న 30 బస్తాల బియ్యం, 60 బస్తాల యూరియా, 35 బస్తాల డీఏపీ, 35 బస్తాల కాంప్లెక్స్ ఎరువులతో పాటు పంటలకు పిచికారీ చేసే స్ప్రేయర్లు, చార్జింగ్ పరికరాలు, అదేవిధంగా 40 పరదాలు, 200 గోనె సంచులు కాలిపోయినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని, మంటల వేడికి గోదాం గోడలు కూడా దెబ్బతిన్నాయని, పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు. శుక్రవారం ఆర్‌ఐ భరత్ ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు.



అలుగు పారుతున్న డిండి ప్రాజెక్టు



పరవళ్లు తొక్కుతూ..



ప్రాజెక్టు వద్ద వాహనాల రద్దీ

డిండి.. పూర్తిగా నిండి

ఉమ్మడి పాలమూరు జిల్లా సరిహద్దు మండలంలోని లక్ష్మీపూర్ శివారుకు అనుసరించి ఉన్న డిండి ప్రాజెక్టు గురువారం సాయంత్రం నుంచి అలుగు పారుతుంది. శుక్రవారం వరద ఉధృతి పెరగడంతో ప్రాజెక్టు మత్తడితోపాటు అలుగు పరవళ్లు తొక్కుతూ దిగువకు వెళ్తుంది. ఈ సుందర దృశ్యాలను తిలకించడానికి శ్రీశైలం వెళ్ల వచ్చే యాత్రికులతోపాటు, పరిసర గ్రామాల నుంచి వారితో అక్కడ సందడి నెలకొంది. ఎగువ ప్రాంతంలోని దుందుభి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మరో వారం రోజులపాటు ప్రాజెక్టు అలుగుపారే పరిస్థితి ఉంది. - ఉప్పునుంతల